క్లుప్తంగా

జనసేన, టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిక



పడమర ఖండ్రిక ఎన్నికల పర్యటనలో అన్యం నాగేశ్వరరావు, వరలక్ష్మి దంపతులు

కపిలేశ్వరపురం: మండలంలోని పడమర ఖండ్రిక గ్రామం నుంచి జనసేన, టీడీపీలకు చెందిన పలువురు ప్రముఖ నాయకులు వైఎస్సార్ సీపీలో చేరారు. గ్రామ పర్యటనకు వచ్చిన వైఎస్సార్‌సీపీ మండపేట ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు సమక్షంలో జనసేనకు చెందిన అన్యం నాగేశ్వరరావు, వరలక్ష్మి దంపతులు, టీడీపీకి చెందిన మాజీ ఉప సర్పంచ్ జమిలి సత్తిబాబు, శనివారపు అచ్చన్న వైఎస్సార్ సీపీలో చేరారు. అనంతరం అంగర, పడమర ఖండ్రిక గ్రామాల్లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో వారు పాల్గొన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు చొరవకు ఆకర్షితులమై పార్టీలో చేరినట్టు వారు తెలిపారు.

దాత కుటుంబ సభ్యులకు ఘన సత్కారం



అంగరలో దాత కుమారుడు, కోడలిని సత్కరిస్తున్న ప్రముఖులు

కపిలేశ్వరపురం: అంగర పీహెచ్‌సీకి అదే గ్రామానికి చెందిన బలుసు రుద్రయ్య మెమోరియల్ ట్రస్ట్ నిర్వాహకులు రూ.50 లక్షల వ్యయంతో అదనపు భవనాన్ని నిర్మిస్తున్నారు. దాత బలుసు సుబ్బారావు, వసుంధర దంపతులు ఈ విరాళాన్ని సమకూర్చారు. వారిరువురి పేరున ఈ పీహెచ్‌సీలో ప్రత్యేక బ్లాక్ నిర్మాణం జరుగుతోంది. కాగా సుబ్బారావు కుమారుడు ప్రతాప్, కోడలు చంద్ర, ఇతర కుటుంబ సభ్యులను శుక్రవారం ఆసుపత్రి ఆవరణలో అంగర, పడమర ఖండ్రిక గ్రామాల ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, ఆసుపత్రి సిబ్బంది ఘనంగా సత్కరించారు. కుటుంబ సభ్యులు కె.మోహనరావు, బలుసు జానకి రామయ్య, కె.ఆదినారాయణలను అభినందించారు. స్వగ్రామంపై మమకారంతో వైద్యసేవల మెరుగుకు కృషి చేస్తున్న దాతలను పీహెచ్‌సీ వైద్యాధికారి పి.రత్నకుమారి, రెండు పంచాయతీల సర్పంచులు తిరునాతి ఆదిలక్ష్మి, వాసా కోటేశ్వరరావు, మాజీ సర్పంచ్ సంకాబత్తుల స్వామికాపు, మాజీ ఎంపీపీ సూరంపూడి సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యులు అడ్డాల శ్రీనివాస్, ప్రముఖులు తిరునాతి వెంకటేశ్వరరావు, మోటిపల్లి బాబులు, యర్రా వీరన్నబాబు, పెద్దింశెట్టి రాంబాబు, నెక్కంటి బాలకృష్ణ అభినందించారు.

సురక్షను సద్వినియోగం చేసుకోవాలి



జగన్నాథగిరి సురక్ష కార్యక్రమంలో రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

కాజులూరు: రాష్ట్రంలో ప్రజారోగ్య పరిరక్షణకు ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని గొల్లపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్.సౌజన్య అన్నారు. శుక్రవారం మండలంలోని జగన్నాథగిరిలో అధికారులు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ సర్పంచ్ కొఠాని అచ్యుతాంబ అరుణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి చెందిన వైద్య నిపుణులు సౌజన్య, మీనా, సురేఖ తదితరులు పాల్గొని 219 మంది రోగులకు వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యాధికారి సౌజన్య మాట్లాడుతూ గ్రామాలలో పౌరులందరికీ వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి తగు చికిత్స నందించటంతో పాటు ప్రజలకు ఆరోగ్య నియమాలపై అవగాహన కల్పించేందుకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు.

20 లీటర్ల సారాతో ఒకరి అరెస్ట్

కపిలేశ్వరపురం: మండలంలోని వీధివారిలంకలో గురువారం రాత్రి అంగర పోలీసులు కరుపోతు యాకోబు అనే వ్యక్తిని అరెస్టు చేశారు. అతడి వద్ద నుంచి రూ.6 వేల విలువైన 20 లీటర్ల సారా, స్టౌ, గ్యాస్ సిలిండర్, మూడు అల్యూమినియం పాత్రలను స్వాధీనం చేసుకున్నారు. బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. నిందితుడిని ఆలమూరు జేఎఫ్‌సీఎం కోర్టులో తరలించగా రిమాండ్ విధించినట్టు ఎస్సై పరదేశి తెలిపారు.

ధీమా ఉంటే ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చెయ్

మండపేట: తోట త్రిమూర్తులుకు తన గెలుపుపై అంత నమ్మకమే ఉంటే భయపడకుండా ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసి ఎన్నికలకు రావాలని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు సవాల్ చేశారు. టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పదవిని అడ్డం పెట్టుకుని ఎన్నికల్లో పబ్బం గడుపు కోవాలని చూడడం సరి కాదని, ఈ ఎన్నికల్లో మళ్లీ గెలిచేది తానేనని ధీమా వ్యక్తం చేశారు.

పేదల ఇంటికే ప్రభుత్వ వైద్యం

- ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌తో లబ్ధి
- ఒక్కో ఆసుపత్రికి ఇద్దరు చొప్పున వైద్యులు
- 43 గ్రామాల ప్రజలకు మెరుగైన వైద్యం
- సీఎం జగన్ ప్రభుత్వంలో విప్లవాత్మక మార్పులు

కపిలేశ్వరపురం: సమాజం ఆరోగ్యంగా ఉండాలంటే విద్య, వైద్య సేవలు ప్రజల చెంతకు చేరాలి. ఇప్పుడు అదే జరుగుతోంది ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో. మరే రాష్ట్రంలోనూ లేని విధంగా రాష్ట్రంలో విద్య, వైద్య రంగాల్లో విశేష సేవలందుతున్నాయి. వైద్య రంగంలో అమలు చేస్తున్న ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌కు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది.

ఇంటి వద్దకే ప్రభుత్వ వైద్యం

అనారోగ్యంతో అవస్థ పడుతున్న రోగి ఇంటి వద్దకే నాణ్యమైన ప్రభుత్వ వైద్యాన్ని అందించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌ను అమలు చేస్తోంది. 2022 చివరిలో ప్రారంభమైన ఈ విధానంతో మండపేట నియోజకవర్గంలోని ఏడు పీహెచ్‌సీల ద్వారా రోగులకు విశేషమైన సేవలందుతున్నాయి. నిర్దేశించుకున్న షెడ్యూల్ ప్రకారం నెలలో రెండు రోజులు 104 వాహనంలో వైద్య సిబ్బంది ఇంటికి వెళ్లి ,రోగులకు వైద్యం చేస్తున్నారు. 104, పీహెచ్‌సీల వైద్యులు, అధికారులు, ఉద్యోగులు, వైద్య ఆరోగ్య, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలంతా సేవా దృక్పథంతో క్షేత్ర స్థాయిలో వైద్య సేవలు అందిస్తున్నారు. బీపీ, షుగరు, టీబీ తదితర 14 రకాల పరీక్షలు చేసే సాంకేతికతతో 104 వాహనాన్ని జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఆధునీకరించింది. 67 రకాల మందులను ఉచితంగా అందజేస్తున్నారు. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో పీహెచ్‌సీకి ఇద్దరు వైద్యులను నియమించడం వల్ల కాన్సెప్ట్ విజయవంతానికి దోహదపడుతోంది. గ్రామంలో వైద్యం చేసేందుకు ఒక వైద్యుడు వెళ్లినా మరో వైద్యుడు ఆసుపత్రిలో సేవలు అందించడం సాధ్యపడుతోంది.



అంగర పీహెచ్‌సీలో గర్భిణిని పరీక్షిస్తున్న డాక్టర్ కన్యాకుమారి

మాతా,శిశు రక్షణకు అధిక ప్రాధాన్యం

ప్రసవం ఒకపుడు ఓ ప్రహసనం. మాతాశిశు రక్షణే ధ్యేయంగా ప్రభుత్వం చర్యలు చేపట్టిన నేపథ్యంలో ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవం చేయించుకునేందుకు గర్భిణులు, వారి సంరక్షకులు ఆసక్తి చూపుతున్నారు. రాష్ట్రంలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ (పీఎంఎస్ఎంఏ) పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న తీరు అందుకు ఎంతగానో దోహదం చేస్తోంది. గత నెలలో నియోజకవర్గంలోని ఏడు పీహెచ్‌సీలలో 225 గర్భిణులను పరీక్షించారు. నూరు శాతం ప్రసవాలు ప్రభుత్వాసుపత్రిలోనే చేయించుకోవాలన్న లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాయి. ప్రోత్సాహకాలను అందిస్తున్నాయి. ప్రైవేట్ ఆసుపత్రుల్లో ప్రసవాలు చేయించుకునే వారికి సైతం ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పథకాన్ని వర్తింపజేస్తోంది. ప్రసవం అనంతరం తల్లీ బిడ్డల పౌష్టికాహారాన్ని సమకూర్చుకునే నిమిత్తం రూ.6 వేలు ఆర్థిక సాయాన్ని సైతం తల్లి ఖాతాకు జమ చేస్తోంది. గర్భిణి ఇంటి వద్ద నుంచి ఆసుపత్రికి రావడానికి 108 అంబులెన్స్, డిశ్చార్జి అనంతరం ఇంటికి వెళ్లేందుకు 102 వాహన సౌకర్యం కల్పిస్తోంది. ప్రస్తుత ప్రభుత్వం జిల్లాకు 13 తల్లీ బిడ్డా వాహనాలను కేటాయించింది. కపిలేశ్వరపురం, మండపేటలలో వాహనాలు అందుబాటులో ఉన్నాయి. శిశువుకు మొదటి టీకా వేస్తుంది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవం జరుపుకున్న బాలింతలకు ఆరోగ్య ఆసరా పథకంలో భాగంగా ప్రోత్సాహక బహుమతులను అందజేస్తోంది. సాధారణ ప్రసవానికి రూ. 4,000, సిజేరియన్ ప్రసవానికి రూ.3,000 ఇవ్వడంతో పాటు వారందరికీ పోషకాహారాన్ని సమకూర్చుకునేందుకు అదనంగా రూ.1000 అందజేస్తోంది.



జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో ఈసీజీ పరీక్ష చేస్తున్న వైద్య నిపుణులు



ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌లో భాగంగా కపిలేశ్వరపురంలో ఇంటికెళ్లి సేవలందిస్తున్న డాక్టర్

సురక్ష శిబిరాలతో మెరుగైన సేవలు

ఆంధ్ర రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ద్వారా ప్రభుత్వ వైద్యులు పేదల ఇంటికే వస్తున్నారు. ఆరోగ్య వివరాలు అడిగి ఉచితంగా మందు లివ్వడమూ, ఆరోగ్య సమస్య తీవ్రతను విశ్లేషించి జగనన్న ఆరోగ్య శిబిరానికి తరలించడమూ, ఆధునిక యంత్రాలతో వైద్య పరీక్షలు చేయడమూ, అవసరమైన వారికి ఆరోగ్యశ్రీలో ఉచితంగా శస్త్ర చికిత్స చేయిస్తున్నారు.

మండపేట నియోజకవర్గంలో వైద్య సేవలిలా...

పీహెచ్‌సీ	జనాభా	గ్రామాలు
అంగర	20,175	05
వాకతిప్ప	16,216	06
అచ్యుతాపురం	17,109	06
ద్వారపూడి	44,904	06
కేశవరం	22,784	06
రాయవరం	26,390	06
మాచవరం	19,000	06
మొత్తం	1,66,578	41

జగనన్న ఆరోగ్య శిబిరాల్లో సేవలిలా...

మండలం	సాధారణ సేవలు	కంటి సేవలు	వైఎస్సార్ ఆరోగ్యశ్రీ
మండపేట	6,603	1,823	65
రాయవరం	6,891	1,717	34
కపిలేశ్వరపురం	8,003	1,973	108
మొత్తం	21,497	5,513	207

నియోజకవర్గాన్ని నంబర్‌వన్‌గా తీర్చిదిద్దుతా..

రెండు గ్రామాల్లో సూర్యప్రకాశ్ ప్రచారం

కె.గంగవరం: నియోజకవర్గాన్ని నంబర్‌వన్‌గా తీర్చిదిద్దడంతో పాటు రామచంద్రపురం నియోజకవర్గ ప్రజలకు అండగా ఉంటూ వారి సమస్యలు పరిష్కరిస్తానని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పిల్లి సూర్యప్రకాశ్ అన్నారు. మండలంలోని పేకేరు, మసకపల్లి గ్రామాల్లో శుక్రవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి ఈ ప్రభుత్వ హయాంలో సంక్షేమ లబ్ధి పొందారని, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలతో ప్రజలు ఆర్థికాభివృద్ధి సాధించారన్నారు. కులం, మతం, పార్టీ భేదాల్లేకుండా టీడీపీ, జనసేన పార్టీల వారికి కూడా సంక్షేమాన్ని అందించిన ఘనత జగన్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. సంక్షేమ ప్రభుత్వం కావాలో, జన్మభూమి కమిటీలు కావాలో ప్రజలకు ఇప్పటికే ఆలోచించి సిద్ధంగా ఉన్నారని అన్నారు. కాబట్టి ప్రజలతా తమ విలువైన ఓటును ఎమ్మెల్యే అభ్యర్థిగా నాకు, ఎంపీ అభ్యర్థిగా రాపాక వరప్రసాద్‌కు ఫ్యాన్ గుర్తుపై బటన్ నొక్కి ఓటేయాలని కోరారు. ఆయన పార్టీ నాయకులతో కలసి ఇంటింటికీ తిరిగి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని కరపత్రాలు పంపిణీ చేశారు. రాజానగరం పరిశీలకులు వట్టికూటి రాజశేఖర్, ఎంపీపీ పంపన నాగమణి, డీసీఎంఎస్ డైరెక్టర్ పెట్టా శ్రీనివాస్, సర్పంచ్‌లు కేతినీడి సందీప్, పిల్లి అన్నపూర్ణ, నియోజకవర్గ మహిళా నాయకురాలు కడలి విజయదుర్గ, ఎంపీటీసీ కోట రామకృష్ణ, కన్వీనర్లు పిల్లి కళ్యాణ్, కాదా గోవింద్, కడలి ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి పిల్లి సూర్యప్రకాశ్

సంక్షేమ పథకాల అమలు జగన్‌తోనే సాధ్యం

ఎంపీ పిల్లి సుభాష్‌చంద్రబోస్

రామచంద్రపురం: మోసపూరితమైన మేనిఫెస్టోతో ప్రజలను తిరిగి మోసం చేసేందుకు అమలు సాధ్యం కాని హామీలను ప్రకటిస్తున్నారని, ప్రస్తుతం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే సీఎం జగన్‌తోనే సాధ్యమని, అందుకోసం వైఎస్సార్ సీపీని గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని, రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్ అన్నారు. పట్టణంలోని పలు వార్డుల్లో శుక్రవారం ఆయన ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ద్వారా జరిగిన మేలును వివరిస్తూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్ సీపీని గెలిపించాలని కోరారు. ఎంపీ బోస్ మాట్లాడుతూ గత ఐదేళ్లలో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పని చేసిందన్నారు. మీ ఇంట్లో మేలు జరిగితేనే తనను ఆశీర్వదించాలని కోరుతున్న దమ్మున్న నాయకుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ప్రస్తుతం అమలవుతున్న సంక్షేమ పథకాలు యథావిధిగా అందాలంటే ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి జగనన్నను సీఎంగా చేసుకోవాలన్నారు. రామచంద్రపురం నియోజకవర్గాన్ని గతంలో ఎంతో అభివృద్ధి పథంలో తీసుకువెళ్లామని, తన కుమారుడు సూర్యప్రకాశ్ వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా పోటీలో ఉన్నారని, ఆయనను ఆశీర్వదించాలని ఎంపీ బోస్ అభ్యర్థించారు. మున్సిపల్ వైస్ చైర్మన్‌లు కోలమూరి శివాజీ, చింతపల్లి నాగేశ్వరరావు, కౌన్సిలర్‌లు బొక్కా సత్యనారాయణ, వాడ్రేవు సాయిప్రసాద్, వీరబాబు, జాబిల్లి, మల్లిడి సత్తిరెడ్డి ఇతర పార్టీ నేతలుకో ఆప్షన్ సభ్యులు, మాజీ కౌన్సిలర్లు పాల్గొన్నారు.



రామచంద్రపురంలోని 24 వార్డులో ప్రచారం చేస్తున్న ఎంపీ బోస్ తదితరులు

వైఎస్సార్ సీపీని ఎదుర్కొనే దమ్ము టీడీపీకి లేదు

రామచంద్రపురం: గతంలో ఏ ముఖ్యమంత్రి చేయలేని సంక్షేమాన్ని రాష్ట్ర ప్రజలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించారని, ఆయన పభుత్వానికి పూర్తి మద్దతు ఇచ్చి రామచంద్రపురం నియోజవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పిల్లి సూర్యప్రకాశ్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని పార్టీ నాయకుడు తొగరు మూర్తి పిలుపునిచ్చారు. నియోజకవర్గంలోని కె.గంగవరం, కాజులూరు మండల గ్రామాల్లో ఆయన ప్రచారం నిర్వహించిన గ్రామ పెద్దలను కలిసి వైఎస్సార్ సీపీకి ఓటు వేయాలని అభ్యర్థించారు. ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సంవత్సర కాలంలోనే కరోనా మహమ్మారి వచ్చి రెండేళ్ల పాటు ఇబ్బంది పెట్టగా కుటుంబ సభ్యులు సైతం రోగుల దగ్గరికి వెళ్లలేని పరిస్థితుల్లో జగనన్న ప్రభుత్వం మెరుగైన వైద్య సేవలు అందించి లక్షలాది మంది ప్రజల ప్రాణాలు కాపాడిన ఘనత సీఎం జగన్‌దేనని మూర్తి అన్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఆయన అందించిన సంక్షేమ పథకాలను ప్రజలందరూ జ్ఞాపకం చేసుకోవాలన్నారు. ఇకపై సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మరలా జగనన్న ప్రభుత్వం అధికారంలోకి తీసుకురావాలన్నారు. నియోజకవర్గంలో దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న ప్రజలకు సొంత ఇంటి స్థలం కలను నెరవేర్చడంతో పాటు సంపూర్ణ హక్కులను ఆ స్థలంపై ఆడపడుచులకు కల్పించి నిజమైన యజమానులను చేసిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి దక్కుతుందని మూర్తి తెలిపారు. ప్రజా సంకల్పయాత్రలో ప్రజల బాధలను స్వయంగా తెలుసుకుని ఆ సమస్యలనే మేనిఫెస్టోలో పొందుపరిచి 99 శాతం హామీలను అమలు చేసిన ముఖ్యమంత్రి దేశంలోనే మొట్టమొదటి స్థానం జగనన్నకే దక్కిందని తెలిపారు. ప్రజలలో ఆదరణను చూస్తే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రామచంద్రపురం నియోజకవర్గ శాసనసభ్యుడిగా పిల్లి సూర్యప్రకాశ్ గెలుపు ఖాయమని తొగరు మూర్తి అన్నారు.



కె.గంగవరం మండలంలో పెద్దలను కలసిన మూర్తి తదితరులు

ఓటమి భయంతోనే అబద్ధపు గోడలు

- ఎమ్మెల్యే వేగుళ్ల మాటలు నమ్మొద్దు
- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- పలు గ్రామాల్లో విస్తృత ప్రచారం

మండపేట: ఈ దఫా ఎన్నికల్లో ఓడిపోతున్నామనే ఆందోళనలో ఉన్న ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ఏ గ్రామానికి వెళ్లినా అబద్ధాలతో గోడలు కడుతున్నారని, ఆయన మాటలు నమ్మి మరోసారి మోసపోవద్దని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని వెలగతోడు, మెర్నిపాడు, పాలతోడు గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. మెర్నిపాడులో సర్పంచ్ గారపాటి సౌజన్య అశోక్ కుమార్‌లు తాము కొత్తగా ప్రతిష్ఠించిన గుడిలో తోటతో అభయాంజనేయ స్వామి వారి దర్శనం చేయించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామంలో ప్రచార రథంపై పర్యటిస్తూ ఎమ్మెల్యే అభ్యర్థి తోట ఓట్లు అభ్యర్థించారు. అక్కడ నుంచి వెలగతోడు వెళ్లిన త్రిమూర్తులు సర్పంచ్ నలమామిడి కృపరాజు ఇతర నాయకులతో గ్రామంలో సుడిగాలి పర్యటన చేశారు. అనంతరం పాలతోడు చేరుకుని సర్పంచ్ పిల్లా వెంకటలక్ష్మి అరవరాజు దంపతులను ప్రచార రథం ఎక్కించుకుని ప్రచారం సాగించారు. సందర్భంగా తోట తన ప్రసంగంలో మెర్నిపాడులో టీడీపీ నాయకుల దౌర్జన్యాన్ని ఖండించారు. బుధవారం రాత్రి మెర్నిపాడులో ఎమ్మెల్యే వేగుళ్ల ప్రవర్తన చూసిన వారికి ఎవరు రౌడీయిజం చేశారో, గ్రామస్తులపై దౌర్జన్యంగా ఎవరు వ్యవహరించారో అర్థమవుతోందన్నారు. ఆ సమయంలో తానుంటే తన కార్యకర్తలనే మందలించి ఎదురెదురు వర్గాలకు గొడవ పడకుండా చూసే వాడినన్నారు. కానీ ఎమ్మెల్యే అలా చేయలేక పోయారన్నారు. ఓడిపోతున్నామనే ఫ్రస్టేషన్‌లో ఉండి ఓ వీధి రౌడీలా ప్రవర్తించారని విమర్శించారు. పాలతోడులో శెట్టిబలిజ కల్యాణ మండపానికి రూ.10 నిధులు మంజూరు చేయిస్తానని తాను హామీ ఇచ్చానన్నారు. వేగుళ్ల తప్పుడు ప్రచారం చేసినంత మాత్రాన ఆ నిధులు రాక మానవన్నారు. ఒక వేళ నిజంగా ఎమ్మెల్యే వేగుళ్ల చెప్పినట్టుగా నిధులు రాకపోతే తన సొంత సొమ్ములు ఇస్తానని హామీ ఇచ్చారు. ఈ నెల 13న జరిగే అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో రెండు ఓట్లు కూడా ఫ్యాన్ గుర్తుపై వేసి తనను, ఎంపీ అభ్యర్థి రాపాక వరప్రసాదరావును అఖండ మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు. ప్రచారంలో జెడ్పీటీసీ సభ్యురాలు కుడిపూడి భవానీ రాంబాబు, ఎంపీపీ వుండమట్ల శ్రీనివాస్, సీతానగరం సర్పంచ్ వరదా చక్రవర్తి, పార్టీ రూరల్ మండల కన్వీనర్ పిల్లా వీరబాబు, సాదె పిడుగురాముడు, ఈదర వీరాస్వామి, గారపాటి మురళీకృష్ణ, పిల్లా సూరిబాబు, పిల్లా అప్పారావు, ముత్యాల రామారావు, చిటికెన వీర్రాజు, గంగరాజు దేవి, ముక్కపాటి కోటేశ్వరరావు, అన్నందేవుల బుజ్జి పాల్గొన్నారు.



మెర్నిపాడు ప్రచారంలో సర్పంచ్ సౌజన్య, తోట త్రిమూర్తులు, వైఎస్సార్ సీపీ నాయకులు

వలంటీర్ల రాజీనామా



వలంటీర్లు సమర్పించిన రాజీనామా పత్రాలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ



కుయ్యేరులో కార్యదర్శికి రాజీనామా పత్రాలు సమర్పిస్తున్న వలంటీర్లు

రామచంద్రపురం రూరల్: మండలంలోని ఓదూరు గ్రామానికి చెందిన ఆరుగురు వలంటీర్లు శుక్రవారం రాజీనామా చేశారు. తమ రాజీనామా పత్రాలను రామచంద్రపురం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ ఎన్వీ రామచంద్రమూర్తికి అందజేశారు. వారు మాట్లాడుతూ బ్యాంకు అకౌంట్లలో పడిన పింఛన్‌ను తీసుకోవడానికి వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు ఈ ఎండల్లో పడుతున్న ఇక్కట్లు చూస్తుంటే బాధ కలుగుతుందన్నారు. టీడీపీ, జనసేన పార్టీలు తమను ప్రజలకు సేవ చేయకుండా చేయడంతో బాధపడటం తప్ప ఏమీ చేయలేని పరిస్థితిలో ఉన్నామన్నారు. అందుకే మానవత్వం ఉన్న మనుషులుగా వారికి సాయం చేయాలన్న ఆలోచనతో తాము వలంటీర్లుగా రాజీనామా చేశామన్నారు. ఇప్పుడు వారికి సాయం చేయకుండా తమను ఎవరూ అడ్డుకోలేరని తెలిపారు. రాజీనామా చేసిన వారిలో గొట్టాల నరేష్, తాతపూడి రాకేష్, గొట్టాల కుసుమ లత, బుంగా జ్ఞానేశ్వరి, సన్నపు సుధారాణి, ఓదూరు సంధ్య ఉన్నారు. వీరిని మాజీ ఎంపీపీ వినకోటి శ్రీనివాస్, వింజుమళ్ల విమలకుమారి, మాజీ సర్పంచ్ కొండేపూడి శ్రీనివాస జానకిరామయ్య, నాయకులు రొక్కాల యేసేపు, వింజుమళ్ల శ్రీనివాస్, కొండేపూడి రామ్మోహనరావు తదితరులు అభినందించారు.

కుయ్యేరులో..

కాజులూరు: మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం సచివాలయ వలంటీర్లు స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. కుయ్యేరులో 23 మంది, ఆర్యావటంలో 23 మంది గొల్లపాలెంలో ఐదుగురు రాజీనామాలు చేసి ఆయా గ్రామ సచివాలయంలో కార్యదర్శులకు తమ రాజీనామా పత్రాలను అందజేశారు. గొల్లపాలెంలో వలంటీర్లు జొన్నకూటి సుభాష్, పలివెల దొరబాబు, టేకుమూడి శ్రీనివాస్ తదితరులు విలేకరులతో మాట్లాడుతూ గత ఐదేళ్లగా పింఛన్ల పంపిణీతో పాటు పలు ప్రభుత్వ పథకాలు లబ్ధిదారులకు చేరవేయటంతో తమకు కేటాయించిన కుటుంబాలకు చేదోడు వాదోడుగా నిలిచామన్నారు. అయితే ప్రతిపక్షపార్టీల నేతలు తమపై అర్థం, పర్థం లేని ఆరోపణలతో ఈసీ తాము విధులకు దూరంగా ఉండాలని ఆంక్షలు విధించిందన్నారు. అది తెలియక తమకు కేటాయించిన కుటుంబాల్లో పలువురు వృద్ధులు, వికలాంగులు తమకు ఫోన్ చేసి ఏఏ పనులు పురమాయిస్తున్నారని వారికి నిరంతరం తమ సేవలందించాలనే ఉద్దేశంతో వలంటీర్ పనికి స్వచ్ఛందంగా రాజీనామా చేశామన్నారు.

కేశవరంలో తోటకు మద్దతుగా ప్రచారం



వైఎస్సార్ సీపీకి మద్దతుగా ప్రచారం చేస్తున్న ఎంపీపీ

మండపేట: వైఎస్సార్ సీపీ మండపేట ఎమ్మెల్యే అభ్యర్థి తోట త్రిమూర్తులుకు మద్దతుగా మండలంలోని కేశవరం గ్రామంలో ఎంపీపీ వుండమట్ల శ్రీనివాస్ శుక్రవారం ప్రచారం చేశారు. ఒకటో సచివాలయం పరిధిలోని రెండో నంబరు బూత్‌కు చెందిన వీధుల్లో పర్యటించి ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేయాలని ప్రజలను అభ్యర్థించారు. తోట త్రిమూర్తులు గ్రామానికి చేసిన అభివృద్ధి గురించి వివరించారు. కార్యక్రమంలో పంచాయితీ ఉప సర్పంచ్ వుండమట్ల నారాయణరావు, వార్డు సభ్యుడు వుండమట్ల హరే రామకృష్ణ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీకి మద్దతుగా రాయవరంలో ప్రచారం

రాయవరం: పేద, బడుగు, బలహీన వర్గాలు, మైనార్టీలు, రైతులు, మహిళలు.. ఇలా ప్రతి ఒక్కరి బంగారు భవిష్యత్తు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని రాయవరం ఎంపీపీ నౌడు వెంకటరమణ అన్నారు. వైఎస్సార్ సీపీ మండపేట ఎమ్మెల్యే అభ్యర్థి ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, అమలాపురం లోక్‌సభ అభ్యర్థి రాపాక వరప్రసాదరావులకు మద్దతుగా శుక్రవారం రాయవరంలో ఆయన ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ వెంకటరమణ, సర్పంచ్ చంద్రమళ్ల రామకృష్ణ, ఉప సర్పంచ్ బొడ్డు శ్రీను, దేవస్థానం చైర్మన్ పులగం శ్రీనివాసరెడ్డి, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు తమలంపూడి గంగాధరరెడ్డి, నాయకులు తాడి రామచంద్రారెడ్డి, పడాల కమలారెడ్డి తదితరులతో కలిసి ఆయన ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ వెంకటరమణ మాట్లాడుతూ కష్టించి పని చేయడం, ఇచ్చిన మాటకు కట్టుబడే ఎమ్మెల్యే అభ్యర్థి తోట త్రిమూర్తులు, అమలాపురం పార్లమెంట్ అభ్యర్థి రాపాక వరప్రసాదరావులకు మద్దతు తెలిపి, రెండు ఓట్లను «ఫ్యాన్» గుర్తుపై వేసి భారీ మెజార్టీని అందించాలన్నారు. ప్రచారంలో మండల పరిషత్ కో-ఆప్షన్ సభ్యుడు పోలిమాటి సుధాకర్, వైఎస్సార్ సీపీ నేతలు పీఎస్ఆర్, కర్రా వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.



రాయవరంలో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలంటూ ప్రచారం నిర్వహిస్తున్న ఎంపీపీ వెంకటరమణ, పార్టీ నేతలు

మండపేటలో ఎన్నికల ప్రచారం హిట్

మండపేట: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే పేదల ఇంట సంక్షేమం వెల్లి విరిసిందని మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వేగుళ్ల పట్టాభిరామయ్య చౌదరి పేర్కొన్నారు. సార్వత్రిక ఎన్నికల పోలింగ్ తేదీ దగ్గర పడుతుండడంతో వైఎస్సార్ సీపీ నాయకులు ప్రచారాన్ని వేగవంతం చేశారు. వార్డుల్లో జోరుగా ప్రచారం సాగిస్తున్నారు. ఓ వైపు పార్టీ సీనియర్ నేతలు పట్టాభిరామయ్య చౌదరి, రెడ్డి రాధాకృష్ణ, మున్సి పల్ చైర్‌పర్సన్ దుర్గారాణి పర్యటిస్తుంటే, మరో పక్క తోట త్రిమూర్తులు కుటుంబీకులు ప్రచారాన్ని ముమ్మరం చేశారు. వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు కుమార్తె కొట్టు శ్రీలక్ష్మి, కోడలు తోట ప్రత్యూషలు మహిళా కౌన్సిలర్‌లను వెంటబెట్టుకుని ఓట్ల వేట సాగిస్తున్నారు. మరోపక్క యువనేత తోట పృథ్వీరాజ్ కూడా విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి చోడే శ్రీకృష్ణ, డాక్టర్స్ విభాగం నాయకుడు చోడే సత్యకృష్ణలతో కలిసి విస్తృతంగా పర్యతన చేస్తున్నారు. శుక్రవారం వారంతా పలు వార్డులో విడివిడిగా ప్రచారం నిర్వహించారు. రెండో వార్డులో ఆ వార్డు కౌన్సిలర్ చిట్టూరి సతీష్ ఆధ్వర్యంలో పట్టాభిరామయ్య, చైర్ పర్సన్ నూక దుర్గారాణి ప్రచారం చేశారు. 13వ వార్డు వైస్ చైర్మన్ పిల్లి గణేశ్వరరావు ఆధ్వర్యంలో పృథ్వీరాజ్ పర్యటించగా, 21వ వార్డులో త్రిమూర్తులు కుటుంబ సభ్యులు ప్రత్యూష, శ్రీలక్ష్మిలు ఓటర్లను కలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంక్షేమ పథకాలను పారదర్శకంగా అమలు చేసిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి మరోసారి అవకాశం ఇవ్వాలన్నారు. మండపేట ఎమ్మెల్యే అభ్యర్థి తోట త్రిమూర్తులుకు అఖండ విజయాన్ని అందించాలని వారంతా విజ్ఞప్తి చేశారు. ప్రచారంలో వైఎస్సార్ సీపీ టౌన్, రూరల్ కన్వీనర్‌లు ముమ్మిడిరపు బాపిరాజు, పిల్లా వీరబాబు, నాయకులు చావా శిరీష్ చౌదరి, పెంకే గంగాధర్, నాగులాపల్లి ఈశ్వరరావు, లాల్ కిషోర్, పంపన శ్రీనివాస్, కుక్కల శ్రీనివాస్, కంది నాగశ్రీదేవి, గంగుమళ్ల శ్రీనివాస్, అన్యం ప్రసాద్, పోలిశెట్టి ప్రసాద్, దుగ్గిరాల రాంబాబు, రామోజీ కృష్ణ, సాధనాల శివ, కోనాల చంద్రబోస్, కొడమంచిలి భాస్కరరావు, జొన్నపల్లి సత్తిబాబు, తాడి రామారావు, అడబాల వీరబాబు, కంది నాగన్న, మెండు బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.



రెండో వార్డులో ప్రచారం చేస్తున్న చైర్ పర్సన్ దుర్గారాణి, పార్టీ నేతలు పట్టాభి, రాజబాబు